

50 పశువులకు ఉచిత వైద్య పరీక్షలు


కేశవదాసుపాలెంలో పశువులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

కేశవదాసుపాలెం గ్రామంలో పశుసంవర్ధక శాఖ, జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ కాకినాడ వారి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 50 పశువులను పరీక్షించారు. రైతులకు ఖనిజ లవణ మిశ్రమం ప్యాకెట్స్, లివర్ టానిక్స్. మినరల్ బ్లాక్సలు అందించారు. కేశవాదుసుపాలెం ఎంపిటిసి సభ్యుడుఉండవల్లి సాయికుమారి, జనసేన గ్రామశాఖ అధ్యక్షులు ఎనుముల తాతాజీ, పశువైద్యులు డాక్టర్ బిబి.సంపత్ కుమార్, డాక్టర్ తోటనవీన్, పారా సిబ్బంది, పివిఎల్ఎస్ఎన్.మూర్తి, బి.జానకిరామారావు, సతీష్, ఎన్.శ్రీను, రైతులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో వైద్యుల కొరత

- భర్తీ కానీ ఆరు పోస్టు లు
- యాక్సిడెంట్, అత్యవసర కేసులు కాకినాడ తరలింపు
- ప్రజలకు తప్పని ఇక్కట్లు
- చర్యలచేపట్టాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గంలోని సుమారు 75 గ్రామాలకు సేవలు అందిస్తున్న ఏరియా ఆసుపత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తుంది. ప్రతిరోజు సుమారు 700 నుంచి 800 వరకు రోగులు ఈ ఆసుపత్రికి వైద్య సేవలు నిమిత్తం వస్తుంటారు. అయితే ఆసుపత్రిలో అత్యవసర సేవలు విభాగంలో ఉండాల్సిన ఆర్థోపెడిక్ వైద్యులు గత ఏప్రిల్ నుండి బదిలీపై వెళ్లిపోవడంతో ఆ పోస్టు నేటికీ భర్తీ కాలేదు. దీంతో పాటుగా చర్మ వ్యాధులు వైద్యులు పోస్టు ఖాళీగా ఉంది. అదేవిధంగా జనరల్ మెడిసిన్ ఒక పోస్టు, గైనకాలజీ విభాగం స్త్రీవ్యాధుల వైద్యులు ఒక పోస్ట్ ఖాళీగా ఉండగా, ఆర్ఎంఒ పోస్ట్ ఒకటి ఖాళీగా ఉంది. వీటితోపాటు రేడియాలజీ పోస్ట్ 2015 నుంచి ఖాళీగా ఉంది. ఈ ఆరు పోస్టులు ఖాళీగా ఉండటంతో రోగులు ఇక్కట్లకు గురవుతున్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు యాక్సి డెంట్లు జరిగే కేసుల్లో చేతులు కాళ్లు విరగగొట్టుకుంటున్నా రోగులు అత్యవసర వైద్యం అందుబాటులో లేకపోవడంతో వారంతా కాకినాడ తరలి వెళు తున్నారు. జిల్లా అధికారులు ఈ పోస్టులను భర్తీ చేసి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకుంటే 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాకినాడ వెళ్లాలంటే నియోజకవర్గ ప్రజలకు రోగులకు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై వెంటనే దృష్టి సారించి ఏరియా ఆసుపత్రిలో అన్ని విభాగాలను వైద్యులు అందుబాటులో ఉండేలాగా చర్యలు చేపట్టాలని పరిసర ప్రాంతాల ప్రజలు రోగులు కోరుతున్నారు.

మంత్రి ఇలాకాలో వైద్యుల కొరత

రామచంద్రపురం నియోజకవర్గంలో గత వైసిపి ప్రభుత్వంలో మంత్రిగా చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ సేవలందించారు. ప్రస్తుతం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సేవలందిస్తున్నారు.


రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో నిత్యం వస్తున్న రోగులు

ఏరియా ఆసుపత్రిలో 15 సంవత్సరాలుగా రేడియాలజీ వైద్యులు లేకపోవడంతో గర్భిణులు, కడుపులో సమస్యలు ఉన్న రోగులు స్కానింగ్‌లకు బయట ప్రయివేటు స్కానింగ్లను ఆశ్రయించవలసి వస్తోంది. ఈ విషయమై మంత్రులు నేటికీ పట్టించుకోకపోవడం విశేషం. గర్భిణులు బయట టిఫా స్కానింగ్‌కు రూ.3000 ఖర్చు చేయవలసి వస్తోంది. అదేవిధంగా కిడ్నీ స్టోన్స్, తదితర ఉదర సంబంధిత వ్యాధుల రోగులు కూడా స్కానింగ్‌లకు బయటకు వెళ్ళవలసి వస్తోంది. దీంతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన చేతి సమురు వదులుతుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు రక్త పరీక్షలు కూడా వైద్యులు ప్రయివేటు ల్యాబ్‌లకు రాయడం, స్కానింగ్‌లను ప్రైయివేటు ల్యాబ్‌లకు పంపించడం వెనక ఏం జరుగుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై మంత్రి దృష్టికి తీసుకువెళ్లిన నేటికీ సమస్య పరిష్కారం కాలేదని పలువురు తెలియజేస్తున్నారు. మంత్రి ఇలాగాలో ఏరియా ఆసుపత్రిలో ఆరు పోస్టులు ఖాళీగా ఉన్న వాటిని భర్తీ చేయించకపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు. దీనిపై మంత్రి స్పందించి ఖాళీ పోస్టుల ను భర్తీ చేయించాలని, రేడియాలజీ వైద్యులను నియమించాలని నిరుపయోగంగా ఉన్న రూ.లక్షల విలువైన స్కానింగ్ మిషన్ వినియోగంలోకి తీసుకురావాలని నియోజకవర్గ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


నిరుపయోగంగా ఉన్న రూ.లక్షల విలువైన స్కానింగ్ మిషన్

రిక్రూట్‌మెంట్ జరిగితే పోస్టుల భర్తీ

రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో వైద్యుల కొరతపై సూపరిండెంటెంట్ ప్రవీణ్ ను వివరణ కోరగా ఆయన ఆర్థోపెడిక్ వైద్యులు ఏప్రిల్ లో బదిలీపై వెళ్లిపోయారని అన్నారు. అదేవిధంగా చర్మ వ్యాధులు వైద్యులు జూన్ లో వెళ్లిపోవడంతో ఆ పోస్టులు భర్తీ కావలసి ఉందన్నారు 2015 నుండి రేడియాలజీ పోస్ట్ ఖాళీగా ఉందన్నారు. రిక్రూట్మెంట్ జరిగిన తర్వాత పోస్టులన్నీ భర్తీ అవుతాయని ఆయన 'ప్రజాశక్తి'కి వివరించారు


రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి

బాణసంచా విక్రేతలు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - అమలాపురం

బాణసంచా అమ్మకందారులు ప్రభుత్వ నిబంధనలను తప్పకపాటించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిల్వలు, అమ్మకాలు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు షాప్ సీజ్, లైసెన్స్ రద్దుకు వెనకాడబోమని ఆమె హెచ్చరించారు. ఈనెల 20న దీపావళి సందర్భంగా ప్రజలు బాణసంచా కొనుగోలు చేస్తాం న్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని బాణసంచా విక్రయ దారులు ఆక్రమ నిల్వలు చేయడంతో పాటు అనుమతులు లేకుం డా విక్రయించే అవకాశం ఉందన్నారు. అటువంటి వారిని గుర్తిం చేందుకు ప్రత్యేక నిఘా బందాన్ని ఏర్పాటు చేశామన్నారు. రెవెన్యూ, పోలీస్, మునిసిపల్, అగ్నిమాపక, పౌర సరఫరాలు, విద్యుత్ తదితర శాఖల అధికారులు సంయు క్తంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. అమ్మకందారులు ప్రభుత్వం నుండి తప్పనిసరిగా లైసెన్స్ పొందాల్సి ఉంటుందని అధికారులు గుర్తించిన ప్రాంతాలను మాత్రమే బాణసంచా దుకాణాల ఏర్పాటు చేసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో టౌన్ ప్లానింగ్ అధికా రులు, గ్రామీణ ప్రాంతాలలో సబ్ డివిజనల్ మేజిస్టేట్ నుంచి ముందు గానే అనుమతికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. జన సంచారం లేని సమయంలో మాత్రమే బాణసంచా ఎగుమ తులు దిగుమతులు జరపాలని అదే సమయంలో అని ముంద స్తు చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి కె మాధవి విక్రయదారులకు సూచించారు.

సమస్యలపై ఎంఎల్ఎ గిడ్డికి వినతి


సమస్యలు విన్నవిస్తున్న పంచాయతీ కాంట్రాక్టు ఉద్యోగులు

ప్రజాశక్తి - పి.గన్నవరం

పంచాయతీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా పంచాయతీ కాంట్రాక్ట్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ బుధవారం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు. పంచాయతీలలో ట్యాంక్ వాచ్, ఎవెన్యూ వాచర్, గేట్ వాల్ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్ ఇలా వివిధ రకాల కేటగిరీలలో డిపిఒ ఆర్డర్‌తో గత 20 నుండి 30 సంవత్సరాలుగా పంచాయతీలలో జనరల్ ఫండ్ నుంచి జీతాలు తీసుకుంటూ పనిచేస్తున్నామని వివ రించారు. తెలంగాణ ప్రభుత్వం కాంట్రాక్ట్ సిబ్బందికి జీతాలు చెల్లిస్తున్న మాదిరిగా పర్మినెంట్ చేసి వారితో సమానంగా జీతాలు ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. జిల్లాలో సుమారు 1,250 మంది విధులు నిర్వహిస్తున్నామన్నారు. క్లస్టర్ వ్యవస్థను రద్దుచేసి పంచాయతీలన పునః వ్యవస్థ వ్యవస్థీకరణ చేస్తున్న ఈ క్రమంలో మా అనుభవం అర్హతలను పరిగణలోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పంచాయతీలలో నిధులు లభ్యత లేనందున ప్రభుత్వం నేరుగా జీతాలు చెల్లించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామపంచాయతీ కాంట్రాక్ట్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు గుంట్రు చిన సత్యనారాయణ, కోలా నాగప్రసాద్, పెద్దిరాజు వేణులరావు, మామిడిశెట్టి శ్రీనివాసరావు, పితాని రాంబాబు, కుసుమే గిరీష్‌కుమార్ మరియు పంచాయతీ కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొని ఎంఎల్ఎకు వినతిపత్రం అందించారు.

పెన్షనర్ల కరువు భత్యం విడుదల చేయాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - కొత్తపేట

పెన్షనర్లకు రావలసిన కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని కొత్తపేట తాలూకా పెన్షనర్ల సంఘం నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెన్షనర్ల సంఘ సమావేశం అధ్యక్షులు కాశి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన బుధవారం జరిగింది. అనంతరం రాజహేంద్రవరానికి చెందిన అకిరా కంటి ఆసుపత్రిచే కంటి, శ్రీ సాయిరాం డెంటల్ కేర్ ఆసుపత్రి వారిచే దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం కార్యదర్శి ఏడిద సత్తిరాజు, మేనేజర్ నారాయణ రావు, వైద్యులు డాక్టర్ రత్నం, డాక్టర్ గణేష్ డాక్టర్ షాహిద్ పాల్గొన్నారు.


శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రాజు

ఉల్లాస్‌పై వాలంటీర్లకు శిక్షణ

ప్రజాశక్తి - ఆలమూరు

మండల స్త్రీ శక్తి భవనంలో ఏపీఎం వి.ఎన్.సత్తిబాబు ఆధ్వర్యంలో అక్షర-ఆంధ్ర(ఉల్లాస్)పై 168 మంది వాలంటరీ టీచర్లకు బుధవారం ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇందులో మండల పరిధి నుంచి వయోజన విద్య అభ్యాసకులను 1680 మందిని గుర్తించినట్లు తెలిపారు. వారందరికీ ఆయా గ్రామాల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలలోగాని, ఎంపిపి పాఠశాలలలో గాని పదిమందికి ఒక టీచర్ చొప్పున ఉదయం గాని, సాయంత్రం గాని ఒక గంట పాటు వయోజనులకు ఉచితంగా తరగతులు నిర్వహిస్తారన్నారు ఈ క్లాసుల నిర్వహణకు సంబంధించిన మెటీరియల్ను అందు బాటులో ఉన్న వాలంటరీ టీచర్లకు అందజేయగా మిగిలిన వారికి ద్వాక్రా యానిమేటర్ల ద్వారా గ్రామా లకు పంపిస్తామన్నారు. ఎంపిడిఒ ఎ.రాజు, జిల్లా ఉల్లాస్ నోడల్ ఆఫీసర్ విజయ భాస్కరరావు మాట్లాడుతూ వయోజనులకు క్లాసులు సమర్థవంతంగా 100 శాతం అక్షరాస్య సభ్యులుగా తయారుచేసి, పరీక్ష రాసే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం విఎన్.సత్తిబాబు, ఎపిఒ అరుణ కుమారి, కార్యదర్శి సాయి ప్రసాద్, రిటైర్డ్ టీచర్, మాజీ సర్పంచ్ గురుచంద్ర స్వరూప్, అకౌంటెంట్ కుమార్, వాలంటరీ టీచర్లు, యానిమేటర్లు పాల్గొన్నారు.

ఎస్.యానాంలో సంక్రాంతి సంబరాలకు సన్నాహం


మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఆనందరావు, కలెక్టర్ మహేష్ కుమార్

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

వచ్చే ఏడాది జనవరిలో సంక్రాంతి సందర్భంగా ఎస్.యానం బీచ్‌లో సంక్రాంతి సంబరాలను అట్టహాసంగా సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలా నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభించినట్లు ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. ఎస్.యానం బీచ్‌లో బుధవారం కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, ఆయా శాఖల అధికారులతో ఎంఎల్ఎ ఆనందరావు సంక్రాంతి సంబరాల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించి, పనులకు శ్రీకారం చుట్టారు. సంక్రాంతి సం బరాల సందర్భంగా బీచ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి అన్ని చర్యలు తీసుకుం టున్నామన్నారు. ఈ ఏడాది నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు రోజుకు లక్ష నుంచి రెండు లక్షల మంది సందర్శకులు వచ్చారని ఈసారి నిర్వహించే సంక్రాంతి సంబరాలకు రెండు నుంచి మూడు లక్షల మంది సందర్శకులు బీచ్ కు వచ్చే అవకాశం ఉందన్నారు. అందుకు తగిన విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సంక్రాంతి సంబరాలకు ఈ ప్రాంతవాసులే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి దేశ విదేశాలలో ఉన్న వారంతా హాజరయ్యేటట్టు బీచ్‌ను అన్ని విధాల సుందరంగా తీర్చిదిద్దుతున్నట్టు ఎంఎల్ఎ ఆనందరావు తెలిపారు. కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు నిర్వహణకు ప్రభుత్వ పరంగా సహాయ సహకారాలు అందిస్తా మని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.మాధవి, చల్లపల్లి సర్పంచ్ ఇసుకపట్ల జయమణి, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ లంకే భీమరాజు, ఎఎంసి ఛైర్మన్ అధికారి జయ వెంకటలక్ష్మి, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, డిసి ఛైర్మన్ దంగేటి చిట్టిబాబు, డ్వామా పీడీ మధుసూదన్, ఎపిడి డి.రాం బాబు పిఆర్ ఇఇ,పి. రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విద్యా సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి


మాట్లాడుతున్న ఎపి హెచ్ఎం సంఘం అధ్యక్షులు రవి

ప్రజాశక్తి - అంబాజీపేట

విద్యా సమస్యలపై ఉపాధ్యాయుని ఎదుర్కొనుచున్న సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్క రించాలని రాష్ట్ర ప్రధాన ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు చివ్వూరి రవి కోరారు. అంబాజీపేట విద్యా వనరుల కేంద్రం వద్ద బుధవారం మండల పరిధిలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులకు, స్కూల్ అసిస్టెంట్లకు ప్రమోషన్ కల్పించాలని, స్కూల్ అసిస్టెంట్లను ఎంఇఒలుగా నియమించి హెచ్ఎంలను అవమాన పరచడం సరికాదన్నారు. అనుభవం లేని అసిస్టెంట్ డైరెక్టర్లను ఎంఇఒలుగా నియమించడం సరికాదన్నారు. ఈ నిర్ణయం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. హెచ్ఎంగా, ఎంఇఒలను ప్రిన్సిపల్ గాను, స్కూల్ అసిస్టెంట్లను పిఒటిలుగాను ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. విద్యేతర కార్యక్రమాలు తగ్గించి బోధనా సమయం పెంచాలన్నారు. హైస్కూల్ విద్యార్థులకు ట్యాబ్‌లు స్థానే ప్రతి పాఠశాలకు 20 కంప్యూటర్లు నియమించాలి. తద్వారా విద్యార్థుల నైతిక విలువలు పెంపొందించాలని కోరారు. అనంతరం ఎపి హెచ్ఎంల సంఘం అధ్యక్షులు చెవ్వూరి రవిని శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల సంఘ జిల్లా అధ్యక్షులు మోకా ప్రకాష్, మరియు మండల స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



సూర్యప్రభ వాహనంపై వెంకన్న


శ్రీకృష్ణ అలంకరణలో సూర్యప్రభ వాహనంపై శ్రీనివాసుడు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు బుధవారం ఉదయం స్వామివారు శ్రీకృష్ణ అలంకరణలో సూర్యప్రభ వాహనంపై ఆలయ మాడవీధుల్లో విహరించారు. ఉదయం నుంచి పండితులు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద ఆచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారికి సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారం భించారు. పలు పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. ఆలయ ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిసి నల్లం సూర్యచక్రధరావు దంపతులు బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ మాడవీధులలో సూర్య ప్రభ వాహనంపై వెంకటేశ్వర స్వామి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. రాత్రి మోహినీ అలంకరణలో చంద్రప్రభ వాహనంపై మోహిని అలంకరణలో కోనేటి రాయుడు ఆలయ మాడవీధుల్లో విహరించారు. కార్యక్రమాలను తిలకిచ్చేందుకు వచ్చిన యాత్రికులతో ఆలయ పరిసరాలన్నీ నిండిపోయాయి.

తహశీల్దార్ కార్యాలయంలో ఎసిబి సోదాలు

- రూ.6,34,500 స్వాధీనం చేసుకున్న ఎసిబి అధికారులు


పట్టుబడ్డ అమలాపురం తహశీల్దార్ అశోక్ ప్రసాద్

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం ఎసిబి సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో ఎసిబి అధికారులు రూ.6,34,500 స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇవి.. రాజమండ్రి రూరల్ మండలంలోని రాజవోలు గ్రామానికి చెందిన గంధం దుర్గా కొండలరావు అమలాపురంలో కొనుగోలు చేసిన భూమిని ఆన్లైన్ చేయడానికి అమలాపురం తహశీల్దార్ అశోక్ ప్రసాద్ రూ.లక్ష లంచం డిమాండ్ చేశారు. అమలాపురం తహశీల్దార్ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ రాము రూ.లక డీల్‌ను రూ.50వేలకు సెటిల్ చేశారు. బుధవారం గంధం దుర్గా కొండలరావు డేటా ఎంట్రీ రాము ద్వారా తహశీల్దార్ అశోక్ ప్రసాద్ రూ.50వేల నగదు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా ఎసిబి అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. దీంతో పాటు తహశీల్దార్ టేబుల్‌లో అనధికారికంగా ఉన్న రూ.5,84,500 ఎసిబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. లంచం తీసుకున్న రూ.50 వేలతో పాటు తహశీల్దార్ టేబుల్‌లో ఉన్న రూ.5,84,500 మొత్తం రూ.6,34,500 ఎసిబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఎసిబి దాడుల్లో డిఎస్‌పి ఎం.కిషోర్ కుమార్, సిఐలు వై.సతీష్, ఎన్‌వి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. తహశీల్దార్ అశోక్‌ను రాజమహేంద్రవరం ఎసిబి కార్యాలయానికి తరలించారు. గురువారం ఆయనను ఎసిబి కోర్టులో హాజరుపరుస్తారు. అనంతరం జ్యుడీషియల్ రిమాండ్ కు తరలిస్తారు.

చిన్నారి వైద్యానికి చేయూత


ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - అల్లవరం

అనారోగ్యంతో చికిత్స పొందుతున్న చిన్నారి వైద్యానిరిక శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్ గ్రూప్ ఆర్థిక సాయం అందజేసింది. వివరాలు ఇవి..కోడూరుపాడుకి గ్రామానికి చెందిన వాసంశెట్టి వాసంశెట్టి ప్రసాద్ కుమారుడు పీయుష్ (7 నెలలు) నిమోనియా వైరల్ ఇన్ఫెక్షన్‌తో చికిత్స పొందుతున్నాడు. హైదరాబాద్ హాస్పిటల్ చికిత్స పొందుతున్న పీయుష్ వైద్య ఖర్చు కోసం శెట్టిబలిజ హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ ద్వారా వసూలైన రూ. 65 వేలు, జిఎంకే చారిటబుల్ ట్రస్ట్ అధినేత, తెలంగాణా రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షులు గుత్తుల మీరకుమార్ ద్వారా రూ.20 వేలు, చెల్లుబోయిన శ్రీనివాసరావు రూ.15 వేలు మొత్తం రూ. లక్ష నగదును చిన్నారి తల్లిదండ్రులకు బుధవారం అందజేశారు. శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ ద్వారా సహాయం చేసిన సభ్యులకు చెల్లుబోయిన శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం శెట్టిబలిజ హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూపు పెద్దలు చెల్లుబోయిన శ్రీనివాసరావు, గుత్తుల చిరంజీవి, గొవ్వాల రాజేష్, మట్టపర్తి నాగేంద్ర, చెల్లుబోయిన నాని, ఇళ్ల శేషరావు, దొమ్మేటి రాము, పాటి శ్రీరామ్, దొంగ సింహాచలం, కముజు రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)-25 పరీక్షకు అర్హులైన 8వ తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు డిఇఒ డాక్టర్ షేక్ సలీంబాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ మరియు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దీనికి దరఖాస్తు చేసుకొనుటకు అక్టోబర్ 25 గడువు తేదీ అని, పరీక్ష ఫీజు ఈ నెల 27 లోపు చెల్లించాలన్నారు.దరఖాస్తు చేయుటకు అర్హతలు ప్రస్తుత విద్యాసంవత్సరంలో 8వ తరగతి చదువుతూ, 7వ తరగతిలో 55 శాతం మార్కులు, ఎస్‌సి, ఎస్‌టి వారు 50 శాతం సాధించి ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.5 లక్షలలోపు ఉండాలన్నారు. విద్యార్థి ఆధార్ కార్డుతో ఉన్న విధంగా దరఖాస్తులో పూర్తి చేసి గడువులోపు డిఇఒ కార్యాలయంలో గాని, వెబ్ సైట్ www. bse.ap.gov.in నందు అందజేయాలని తెలిపారు.

గూగుల్‌తో విశ్వనగరంగా విశాఖ

ప్రజాశక్తి - రామచంద్రపురం

గూగుల్ సెంటర్ ఏర్పాటుతో విశాఖ పట్నం విశ్వనగరంగా ఎదిగేందుకు మరో అడుగు ముందుకు పడిందని రాష్ట్ర కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం ఒక ప్రకటనల పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్యానికి ఈ కొత్త సాంకేతికత ఉపయోగపడుతుందన్న ఆశాభావాన్ని మంత్రి సుభాష్ వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర వారికే కాకుండా కోస్తా జిల్లాలోని ఐటి నిపుణులకు ఈ సెంటర్ ద్వారా ఉపాధి లభిస్తుందన్నారు. భారత డిజిటల్ ఎకానమీని సమూలంగా మార్చేందుకు ఈ కేంద్రం ప్రేరకం అవుతుందని మంత్రి వివరించారు.



సంఘీభావం తెలిపిన ప్రజాసంఘాలు

5వ రోజుకు రిలే దీక్ష

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నిరుపయోగంగా ఉన్న ఆర్‌టిసి బస్టాండ్‌ను వెంటనే పునరుద్ధరించి, బస్సులను నడపాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చికురుమిల్లి రవి కుమార్ చేపట్టిన రిలే దీక్ష బుధవారం ఐదో రోజుకు చేరింది. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక సమైక్యాంధ్ర శిబిరం వద్ద రవికుమార్ చేస్తున్న దీక్షకు బిఎస్‌పి, సిపిఎం నాయకులు సంఘీభావం తెలిపారు. రవికుమార్ మాట్లాడుతూ ఆర్‌టిసి అధికారుల నిర్లక్ష్యంతో అయిదేళ్లగా బస్టాండ్‌కు బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపై ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రజల ప్రయోజనార్ధం రిలే నిరాహార దీక్ష చేస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న ఆర్‌టిసి బస్టాండ్‌కు బస్సులు రాకపోకలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షకు సిపిఎం నాయకుడు సఖిలే సూర్య నారాయణ, బిఎస్‌పి నాయకులు బడుగు భీమేశ్వరరావు, జంగా నాగేశ్వర రావు, పందిరి శ్రీనివాసరావు, పి.రాంజీ, అడ్వకేట్ కన్నిడి వెంకటరమణలతో పాటు నీలం చినబాబు, మెండి కృష్ణ బాబు తదితరులు సంఘీభావం తెలిపి దీక్షలో పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని అధికారులు అన్నారు. బుధవారం వెదురు మూడి బిసి అంగన్‌వాడీ సెంటర్ వద్ద మండపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి యు.పూర్ణిమ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ వి.కుమారి అంగన్ వాడీ కార్యకర్తలు గర్భిణులు, బాలింతలతో పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారి మాట్లాడుతూ చిన్నారుల మానసిక ఆరోగ్య పెరుగుదలకు పోషకాహార అవశ్యకత పై గర్భిణులు, బాలింతలకు అవగాహనా కల్పించారు. అందుబాటు ధరల్లో దొరికే జామ, మునగ, ఆకుకూరలు వంటి పోషక విలువలుతో కూడిన ఆహార పదార్థాలు విరివిగా తీసుకోవాలన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే వ్యాధి నిరోధకశక్తికి తల్లి పాలు దోహదపడతాయనీ సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వై.శారద, కూటమి నాయకులు బోణం నాని బాబు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం విజయవంతం

కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురంలో జరిగిన వెండర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం (విడిపి) విజయవంతమైందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. అక్టోబర్ 14, 15 తేదీల్లో కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్య క్రమంలో సుమారు 150 మంది కొనుగోలు దారులు, అమ్మకందారులు పాల్గొని చర్చల ద్వారా అవగాహన పొందారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విడిపి ప్రోగ్రాం భారత ప్రభుత్వం పరిశ్ర మల, వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి కోసం ఏర్పాటు చేయబడిందన్నారు. కలెక్టర్ వివరించిన వివరాల ప్రకారం స్థానికంగా ఉన్న పరిశ్రమలను ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలతో అను సంధానించడం, స్థానిక ఉత్పత్తులకు మార్కెట్ దొరకేలా దోహదపడటం ప్రధాన లక్ష్యమని అన్నారు. కొబ్బరి విలువ ఆధారిత ఉత్పత్తులు, క్వాయిర్, జూట్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనపై అవగాహన కల్పించారన్నారు. కార్యక్రమం 'ఒక జిల్లా–ఒక ఉత్పత్తి' పథకంతో అనుసంధానంగా ఉండి, జిల్లా ఉత్పత్తుల మార్కె టింగ్, ఎగుమతులకు కొత్త మార్గాలు తెరిచిందని తెలి పారు. ఎంఎస్ఎమ్ఇలకు విదేశీ కంపెనీలతో మార్కె టింగ్ అవగాహన కల్పిస్తూ, గెయిల్ టెండర్లలో 25% అవకాశాలు చిన్న పరిశ్ర మలకు కేటాయించిన అంశంపై కూడా పవర్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఎంఎల్ఎ ఆనందరావు మాట్లాడుతూ పర్యాటకం, గార్మెంట్స్ తయారీ, పాడి పరిశ్రమల అభివృద్ధికి మంచి అవ కాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముం దుకు వస్తే ఎపిఐఐసి సిఎస్ఆర్ ద్వారా అవసరమైన వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. గెయిల్ వారి టెండర్లలో 25 శాతం ఎంఎస్ఎమ్ఇలకు ఇచ్చే విధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారన్నారు. ఎంఎస్ఎంఇ సపోర్టింగ్ అంశాలపై సమగ్ర అవగాహన పెంపొం దించా రన్నారు. ఈ కార్యక్రమంలో వెండర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంప్రదింపుదారులు వేణు గోపాల్, ప్రతినిధి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

మాజీ రాష్ట్రపతి కలామ్‌కు ఘన నివాళి


అమలాపురంలో సివి.రామన్ స్కూల్లో కలామ్ జయంతి

ప్రజాశక్తి -యంత్రాంగం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో భారత మాజీ రాష్ట్రపతి భారతరత్న డాక్టర్ ఎపిజె.అబ్దుల్ కలామ్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. **అమలాపురం**:కలామ్ జయంతిని సర్ సీవీ రామన్ స్కూల్ నందు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ రవణం వేణుగోపాల్, ప్రిన్సిపల్ కేశవరావు, ఆర్ఎస్‌యు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు నరేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **మామిడికుదురు:** అబ్దుల్ కలామ్ పేపర్ బాయ్ నుంచి గొప్ప శాస్త్ర వేత్తగా ఎదిగిన స్ఫూర్తి ప్రదాత అని ప్రధానోపాధ్యాయులు నాగోజీరావు, బావిసెట్టి నాగేశ్వరరావు అన్నారు. పాశర్లపూడి హైస్కూల్, నగరం మోడల్ స్కూల్లో అబ్దుల్ కలామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి,


పాశర్లపూడి హైస్కూల్లో ..

అబ్దుల్ కలాం జయంతి ఘనంగా నిర్వహించారు కలామ్ సాధించిన విజయాలు, జీవన ప్రస్థానం, గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. **రామచ ంద్రపురం:** కలామ్ 94వ జయంతి నీ పట్నంలోని టిడిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం, ఎస్‌కెపిపి ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు మాస్టర్, కూటమి నాయకులు కడియాల రాఘవన్, కవల నానాజీ, కంచు మర్తి బాబురావు తదితరులు పాల్గొ న్నారు. **రావులపాలెం:** మండల పరిధి పొడగట్లపల్లి ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వి. శేషుకుమార్ అధ్యక్షతన ఉపాధ్యాయులు గోకవరపు పద్మనాభం ఆధ్వర్యంలో అబ్దుల్ కలామ్ జయంతి నిర్వహించారు.


రామచంద్రపురంలోని టిడిపి కార్యాలయంలో కలామ్ జయంతి

కార్యక్రమంలో భాగంగా అబ్దుల్ కలామ్ వేషధారణలో ఆరవ తరగతి విద్యార్థి సందీప్ ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధికసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.


పొడగట్లపల్లిలో కలామ్ వేషధారణలో విద్యార్థి

నేరాలు ఘోరాలు

పంట కాల్వలోకి దూసుకెళ్లిన వ్యాన్

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

వ్యాను అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకెళ్లిన సంఘటనలో బుధవారం ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మల్లం గ్రామానికి చెందిన కొంతమంది శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా యు.కొత్తపల్లి మండలం ఎండపల్లి, నాగులపల్లి వద్ద డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా వ్యాన్ పంట కాలువలోకి దూసుకెళ్లింది. వ్యాన్‌లో ఉన్న 30 మంది సురక్షితంగా బయటపడినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

కంటైనర్ లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన గోపాలపురం శివారులో బుధవారం చోటుచేసుకుంది... బంధువులు, తోటి ఉద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం. నిడదవోలుకు చెందిన అహ్మద్ జవహర్(45) మండలంలోని కరిచర్లగూడెం గ్రామంలో ఉన్న ఓంకార్ ఫెర్టిలైజర్ కంపెనీలో మూడు నెలలుగా ఫిట్టర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం కంపెనీ పని నిమిత్తం పంగిడికి వచ్చిన అతను తిరిగి ఫ్యాక్టరీకి ద్విచక్రవాహనంపై వెళ్లే క్రమంలో గోపాలపురం శివారులో కంటైనర్ లారీ వెనక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బంధువులకు సమాచారం ఇచ్చారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.మనోహర్ తెలిపారు. లారీని స్టేషన్‌కు తరలించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండల పరిధిలోని పోచవరం గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన 1800 కేజీల పిడిఎస్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని ఒక ఇంటిలో రేషన్ బియ్యం నిల్వలు ఉన్నట్లుగా వచ్చిన సమాచారంతో అధికారులు దాడులు నిర్వహించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని చౌక ధరల దుకాణంలో అప్పగించారు. బియ్యాన్ని నిల్వచేసిన గుర్రాల పోసియ్యపై 6 ఎ కేసు నమోదు చేశామని డిటి దివాకర్ తెలిపారు. ఈ దాడుల్లో డిఎస్ఒ పార్వతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు రోడ్ కం రైల్వే వంతెనపై ఈ నెల 12న జరిగిన రోడ్డు ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని దేచర్ల గ్రామానికి చెందిన నూకతట్టి భూపతిరావు ఈనెల 12న వ్యక్తిగత పని మీద రాజమహేంద్రవరం వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా రోడ్డు కం రైల్వే వంతెనపై వ్యాన్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను తీవ్ర గాయాలపాలయ్యాడు. అదే వ్యాన్ డ్రైవర్ రాజమహేంద్రవరంలో ఒక ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించి వెళ్లిపోయాడు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పిచ్చి కుక్క స్వైర విహారం

ప్రజాశక్తి - ఆలమూరు

కొత్తూరు సెంటర్లో బుధవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. సుమారు ఆరుగురిని కరిచి ఆ పిచ్చి కుక్క చింతలూరు కాలనీ వైపు వెళ్లినట్లు స్థానికులు తెలియజేశారు. గాయపడిన ఆరుగురిలో ఇరువురికి తీవ్రంగా రక్తస్రావమైనట్లు స్థానికులు తెలిపారు. ఇందులో చిన్న పాటి గాయంతో స్థానిక శ్రీవిద్య స్కూల్ టీచర్ బద్రి తన కాలుకు షూష్ ఉండటంతో తప్పించుకున్నారు. అయినప్పటికీ స్థానిక ప్రభుత్వాసుపత్రి వెళ్లి రేబిస్ వ్యాధి నివారణకు మందులు తీసుకున్నట్లు ఆయన విలేకరులకు తెలిపారు.

కాంగ్రెస్ సంతకాల సేకరణ

ప్రజాశక్తి-కాకినాడ

కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా చేపట్టిన పిలుపులో భాగంగా కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పల్లంరాజు బుధవారం సంతకాల సేకరణ చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అభిమానులు, నాయకులు కార్యకర్తలతో పెద్ద ఎత్తున పాదయాత్ర చేపట్టి ప్రజలకు ఓటర్లను ప్రభుత్వాలు ఏ విధంగా మోసం చేస్తున్నాయనే దానిపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రధాన నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు కాకినాడలో ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలతో కలిసి సంతకాలు చేపట్టారు. చెక్క నూకరాజు, మట్ట ప్రసాద్, యాళ్ళ రామకష్ణ పాల్గొన్నారు.

బాలల ఆరోగ్యానికి కృషి

ప్రజాశక్తి - సామర్లకోట

బాలల సంపూర్ణ ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందిస్తోందని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఐసిడిఎస్ సామర్లకోట కార్యాలయంలో పోషకాహార వారోత్సవాల్లో భాగంగా బుధవారం సామూహిక సీమంతాల కార్యక్రమం సిడిపిఒ జి.ఉష ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ చినరాజప్ప పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య వంతమైన సమాజానికి అంగన్వాడీ కేంద్రాలు వేదికగా నిలుస్తున్నాయన్నారు. వీటిద్వారా పుట్టినరోజు బిడ్డ మొదలు బాలింతలకు, గర్భిణులకు పోషకాహారాన్ని అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణ భాధ్యతలు అంగన్వాడీలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అందుగుల మణికుమారి, జనసేన నాయకులు పిట్టా జానకి రామారావు, సిడిపిఒ ఉష మాట్లాడారు. కూటమి నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, బలుసు వాసు, సరోజ వాసు, సొసైటీ అధ్యక్షులు పైణ్ణి శ్రీనివాసరావు, వల్లూరి దొరబాబు, సుల్తానా బీబీ, ఎన్.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి- తాళ్లరేవు

సిహెచ్‌సికి ప్రతి బుధవారం వచ్చే గర్భిణులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పౌష్టి కాహారం అందిం చారు. చిట్టూరి కృష్ణ కుమారుడు శివరాం కిషోర్, కుటుంబ సభ్యుల సహకారంతో ఈ ఆహారం అందించారు. ఆసుపత్రి వైద్యులు, అభివృద్ధి కమిటీ డైరక్టర్లు, లయన్ క్లబ్ ప్రతినిధులు ఉన్నార


భీమేశ్వరాలయంలో హుండీలు లెక్కిస్తున్న సిబ్బంది

భీమేశ్వరునికి రూ.24.72 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ భీమేశ్వర స్వామి దేవస్థానంలో దేవస్థానంలో హుండీల ను బుధవారం లెక్కించారు మొత్తం 102 రోజులకు హుండీల ద్వారా ఆదాయం రూ.24,72,056 లభించింది. దీంతోపాటుగా బంగారం 2.200గ్రాములు, వెండి 99 గ్రాములు వచ్చింది. అన్నదానం హుండీ ద్వారా రూ.1,64, 675 ఆదాయం సమకూరిందని దేవస్థాన సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని తెలియ చేశా రు. హుండీ లెక్కింపును జిల్లా అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, రామచంద్రపురం డివిజన్ తనిఖీదారులు బాలాజీ రాంప్రసాద్, కె.గంగవరం గ్రూప్ టెంపుల్స్ ఇఒ వి.బాలకృష్ణ, వెల్ల గ్రూప్ టెంపుల్స్ ఇఒ వైవివి.సత్యనారాయణ పర్యవేక్షించారు. టిడిపి నాయకులు, పెంకే సాంబ శివరావు ,ఆళ్ల బుజ్జి దవులూరి రామకష్ణ ,అల్లం రామకష్ణ , నవీన్ ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

డిసిసిబి చైర్మన్‌ను సత్కరించిన బాబ్జి

ప్రజాశక్తి - ఆలమూరు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన డిస్ట్రిక్ట్ కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు)ను నర్సిపూడి సొసైటీ చైర్మన్ రాయుడు వెంకటస్వామి(బాబ్జి) బుధవారం ఘనంగా సత్కరించారు. రాజమహేంద్రవరం విచ్చేసిన ఆయన్ని స్థానిక జిల్లా కో–ఆపరేటివ్ బ్యాంకులో మర్యాద పూర్వకంగా కలిశారు. బాబ్జి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నర్సిపూడి సొసైటీకి సంబంధించి ముఖ్యంగా రైతుల సౌకర్యార్థం అదనపు గోదాములు నిర్మించాలన్నారు. అలాగే స్థానికంగా నర్సిపూడి లో కళ్యాణ మండపం లేదని ఈ రెండింటి కోసం ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని బాబ్జి వివరించారు.



రేషన్ బియ్యాన్ని పరీక్షించేందుకు సిద్ధమైన మొబైల్ ర్యాపిడ్ టెస్టింగ్ కిట్లు

రేషన్ బియ్యం అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు

ప్రజాశక్తి - కొత్తపేట

రేషన్ బియ్యం అక్రమ రవాణా నిరోధానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని తహశీల్దార్ వై.రాంబాబు అన్నారు. పౌరసరఫరాల శాఖ 700 మొబైల్ ర్యాపిడ్ టెస్టింగ్ కిట్లు అందుబాటులో తీసుకువచ్చిందన్నారు. ఆయన బుధవారం విలేకరలతో మాట్లాడుతూ బియ్యంపై అనుమానం వచ్చిన వెంటనే కిట్ల ద్వారా పరీక్షించి అది రేషన్ బియ్యమా కాదా అనేది వెంటనే తేల్చేయవచ్చన్నారు. పొటాషియం థయోసైనేట్ హైడ్రోక్లోరిక్ యాసిడ్ ద్రావణాలతో ఈ పరీక్ష చేస్తారన్నారు. రేషన్ బియ్యం అయి తే రంగు ఎరుపుగా మారుతుందన్నారు. దీంతో అక్రమ రవాణాలను అరికట్టవచ్చని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలియజేశారన్నారు.

పత్తి, పట్టు రైతులకు అవగాహన

ప్రజాశక్తి–గొల్లప్రోలు

పత్తి పంటపై పురుగు మందులు పిచికారీ చేసినప్పుడు పట్టుపురుగులు గూడు కట్టక పోవడంతో పట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం మండలంలోని చేబ్రోలు మహిళా సమాఖ్య భవనంలో దీనిపై పట్టు, పత్తి రైతులు, సెరికల్చర్ అగ్రికల్చర్ శాస్త్రవేత్తలు అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు ఓరుగంటి శ్రీను, ఉలవకాయల రాంబాబు, ఓరుగంటి నానాజీ ఆవేదనని వ్యక్తం చేశారు. 40 ఏళ్ల నుంచి పట్టు సాగు చేస్తున్నప్పటికీ పట్టుపురుగులు గూడు కట్టకపోవడం ఎప్పుడూ లేదన్నారు. 33 వేల గుడ్లు గూడు కట్టక నష్టపోయామన్నారు. సెంట్రల్ సిల్క్ బోర్డ్ సైంటిస్ట్ డాక్టర్ భువనేశ్వరి, ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎ.సీతారామశర్మ మాట్లాడుతూ పట్టుపురుగులు పెంపకం ఉన్నప్పుడు పత్తి రైతులు మందులు పిచికారీ చేసే ముందు పట్టు రైతుకి తెలియజేయాలని, పట్టు, పత్తి రైతులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. పట్టుపురుగుల పెంపకం దగ్గర రక్షణ పంటగా జొన్న లేదా సజ్జ పంటలను ఐదు ఆరు వరుసల్లో ఒత్తుగా వేసుకొని పురుగుమందును పట్టుపురుగు దగ్గరికి చేరకుండా చూసుకోవాలన్నారు. పత్తి పంటలో కూడా చివరి నాలుగు వరుసలలో మందులు పిచికారి చేయవద్దన్నారు. జిల్లా సెరికల్చర్ డిడి రాజేంద్ర ప్రసాద్ బాబు, ఎఒ కెవివి.సత్యనారాయణ, చేబ్రోలు పట్టు పరిశ్రమ ఎఎస్ఒ సత్యనారాయణ, మాదేపల్లి సత్యానందరావు, రామకృష్ణ, యేసు పాల్గొన్నారు.

ఘనంగా పవిత్రోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో పవిత్రోత్సవాలను బుధవారం ప్రారంభించినట్లు ఆలయ సహాయకమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి శిష్య బందం ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు ఘనంగా పవిత్రోత్సవాలు జరుగుతా యన్నారు ఆలయ పవిత్రతకు ఎటువంటి లోపం లేకుండా దోషాలను నివారించేందుకు ఈ పవిత్రోత్స వాలు నిర్వహిస్తారన్నారు భారీ సంఖ్యలో యాత్రికులు పవిత్రోత్సవాల్లో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆలయ సహాయకమైన కమిషనర్ తెలిపారు.

శాలివాహనుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - అయినవిల్లి

శాలివాహన కుటుంబాల అభివృద్ధికి కృషి చేస్తానని శాలి వాహన కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ పేర్కొన్నారు రాష్ట్ర పర్యటనలో భాగంగా జిల్లా అయినవిల్లి మండలంలో అయన పర్యటించారు. తొలుత అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం అయినవిల్లి, మాగం గ్రామంలో తాడినాటి రామకష్ణ ఇంటివద్ద ఏర్పాటు చేసిన శాలి వాహన కుమ్మరి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎర్పాటు చేసిన సమవేశంలొ చైర్మన్ ఈశ్వర్ పాల్గొ న్నారు కార్యక్రమంలొ జిల్లా డైరెక్టర్ ఎమ్.విజయకుమారి, మాగాం టిడిపి గ్రామశాఖ అధ్యక్షుడు తాడి నాటి రామకష్ణ, మానేపల్లి వీర బ్రహ్మం, తాడినాటి ప్రసాద్,మానేపల్లి గణపతి, పలువురు శాలివాహన సంఘం నాయకులు పాల్గొన్నారు.


వేలం నిర్వహిస్తున్న ఇఒ సత్యనారాయణ రాజు

అయినవిల్లి దేవస్థానంలో కొబ్బరి చెక్కల వేలం

ప్రజాశక్తి - అయినవిల్లి

స్వామి వారికి యాత్రికులు సమర్పించిన కొబ్బరి చెక్కలు పోగుచేసుకుని దానికి సంబంధించి బుధవారం వేలం అధికారులు వేలం నిర్వహించారు. ఈ ఏడాదిలో వచ్చే నెల 16వ తేదీ 2025 నుంచి వచ్చే ఏడాది నవంబర్15వ తేదీ వరకు ఒక ఏడాది కాలమునకు తీసుకుని వెళ్లే హక్కునకు ఆలయం వద్ద ఇ–టెండర్/ సీల్డ్ టెండర్/ బహిరంగ వేలం నిర్వహించారు. హెచ్చు పాటదారుగా తొండంగి మండలం సీతారామపురానికి చెందిన గింజాల నాగ వెంకటసత్తిబాబు రూ.72,23,499 వేలంలో దక్కించుకున్నారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది రూ.27,23,499 వచ్చిందనిసహాయ కమిషనర్, ఇఒ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. వేలం అమలాపురం తనిఖీదారు జంపా రామలింగేశ్వర రావు పర్యవేక్షణలో నిర్వహించారు. వేలం గ్రామ పెద్దలు, పాటదారులు, పాత్రికేయలు సమక్షంలో నిర్వహించారని ఇఒ తెలిపారు.

ఉపాధి హామీపై సమీక్షా సమావేశం

ప్రజాశక్తి-రౌతులపూడి

ఉపాధి హామీ పథకంలో పని చేసే శ్రామికులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇకెవైసిని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కత్తిపూడి సెక్షన్ ఎపిడి భ్రమరాంబ ఉపాధి హామీ సిబ్బంది ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ శివరామకృష్ణయ్య, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలవ్యాప్తంగా 24 వేల మంది ఉపాధి శ్రామికులకు గాను ఇప్పటివరకు 14,000 మందికి ఉపాధి హామీ పూర్తి చేసినట్టు తెలిపారు.

ఆదిత్యలో మహిళల ఆరోగ్యంపై సదస్సు

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ విభాగం ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్యంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరానికి చెందిన హెలియోస్ హాస్పిటల్ డాక్టర్ లలిత కంభంపాటి, మరియు ముంబైకు చెందిన ఎంఎస్‌డి ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్, సీనియర్ థెరపీ మేనేజర్ అష్రఫ్ మహమ్మద్ చావడా ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు.డా. లలిత కంభంపాటి మహిళల్లో అండాశయ వ్యాధి నియంత్రణ, హార్మోన్ల సమతులారోగ్యకరమైన జీవనశైలి ప్రాముఖ్యత వివరించారు. అష్రఫ్ మహమ్మద్ చావడా గర్భాశయ క్యాన్సర్ టీకా ప్రాముఖ్యత, సర్వైకల్, ఇతర పెల్విక్ క్యాన్సర్ల నివారణలో పాత్ర గురించి తెలిపారు.

శానిటేషన్ పనుల తనిఖీ

ప్రజాశక్తి-కాకినాడ

నగరంలోని శానిటేషన్ పరిస్థితిని ఇన్‌ఛార్జి కమిషనర్ కెటి.సుధాకర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. నగరంలోని వార్ఫ్ రోడ్డు, జిల్లా పరిషత్ ప్రాంతాలు, 14వ సర్కిల్‌లోని గైగోలుపాడు ప్రాంతాల్లో శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శానిటేషన్ పనుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన శానిటేషన్ ప్రమాణాలు మెరుగు పర్చకపోతే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. 12వ సర్కిల్‌లోని మస్టర్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన పారిశుద్య కార్మికుల హాజరు పత్రాలను పరిశీలించారు.

గ్లోబల్ హ్యాండ్ వాష్ డే

ప్రజాశక్తి - ఆలమూరు

మండల మహిళా సమాఖ్య కేంద్రంలో గ్లోబల్ హ్యాండ్ వాష్ డే అవగాహనా కార్యక్రమాన్ని ఎపిఎం వినీ.సత్తిబాబు ఆధ్వర్యంలో బుధవారం మహిళలతో నిర్వహించారు. సత్తిబాబు మాట్లాడుతూ ఆరోగ్యం శుభ్రత ప్రతి గ్రామ సంఘాలలో హ్యాండ్ వాష్ నిర్వహణ కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. హ్యాండ్ వాష్ వలన శుభ్రత లేకపోతే చెడు క్రిములు అనారోగ్యానికి గురి చేస్తాయని, చేతులతో ప్రతి వస్తువును ముట్టుకుంటామన్నారు. అందుకే శుభ్రపరచుకొని పిల్లల ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హ్యాండ్ వాష్ విధానాలను మహిళా సంఘాలకు సత్తిబాబు అవగాహన కల్పించారు.

జీవన ఎరువుల వినియోగంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రైతులు భూసారాన్ని కాపాడి, అధిక దిగుబడులు సాధించేందుకు జీవన ఎరువుల దోహదం చేస్తాయని జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ మరియు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.నంద కిషోర్ పేర్కొన్నారు. జీవన ఎరువుల వారోత్సవాల్లో భాగం మండలంలోని చినకొత్తలంక పంచాయతీ పరిధిలో ని రైతు సేవా కేంద్రం నందు బుధవారం మండల వ్యవసాయ అధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్ అధ్యక్షతన జీవన ఎరువుల వినియోగంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు నంద కిషోర్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులనుద్దేశించి మాట్లాడుతూ రైతులు జీవన ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా భూసారం కాపాడటమే కాకుండా, అధిక దిగుబడులు సాధించవచ్చున్నారు. జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు రాజశేఖర్ మాట్లాడుతూ పరిశోధన కేంద్రాలలో జీవన ఎరువులను అందుబాటులో ఉంచమని రైతులు వీటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు గౌతమ్ కుమార్ పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.